జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 160 25-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06




# తెలంగాణలో హిట్లర్ పాలన

## ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

- తెలంగాణలో హిట్లర్ తరహా పాలన సాగుతోందన్న హరీశ్ రావు
- ఖమ్మంలో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేస్తోందని ఆరోపణ
- మంత్రి పొంగులేటి ల్యాండ్ గ్రాబర్‌గా మారారంటూ తీవ్ర విమర్శ
- రైతు ఆశీర్వాద సభను క్షమాపణ సభగా మార్చాలని డిమాండ్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హిట్లర్ తరహా పాలన సాగిస్తోందని, ఖమ్మం జిల్లాలో పేదల ఇళ్లను కూల్చివేస్తూ దమనకాండకు పాల్పడుతోందని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేదలకు






2లో

### రాయదుర్గం భూముల వివాదానికి ముగింపు..

# వెనక్కి తగ్గిన ఎస్‌బీఐ?

## పరిష్కారం దిశగా రాయదుర్గం భూవివాదం

- హైకోర్టు పిటిషన్ ఉపసంహరణకు ఎస్‌బీఐ సుముఖత?
- ప్రత్యామ్నాయ 2.5 ఎకరాల భూమికి అంగీకారం
- టీజీఐఐసీ, ఎస్‌బీఐ మధ్య మరో విడత చర్చలు
- ఎస్‌బీఐతో ప్రభుత్వ లావాదేవీల పునరుద్ధరణకు నిర్ణయం
- హైకోర్టు విచారణ అనంతరం అధికారిక ప్రకటనకు అవకాశం

# ఓటరు వివరాల సేకరణ నేటి నుంచి షురూ

- ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయనున్న బీఎల్ఓలు
- జూలై 24లోగా నింపిన ఫారాలను తిరిగి సమర్పించాలి
- అప్పుడే జూలై 31న ప్రచురించే ముసాయిదా జాబితాలో చోటు
- ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు/దరఖాస్తుల స్వీకరణ
- ఆన్‌లైన్‌లో సైతం ఎన్యూమరేషన్‌కు అవకాశం





2లో

# కొందరు రిలాక్స్ అవుతున్నారు...

- అది కోవిడ్ కన్నా ప్రమాదకరం: నారా లోకేశ్
- వైసీపీ ఫేక్ ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని కేడర్‌కు లోకేశ్ పిలుపు
- అధికారంలోకి వచ్చాక రిలాక్స్ అవ్వడం కోవిడ్ కన్నా ప్రమాదకరమన్న లోకేశ్
- 'రెడ్ బుక్' తన పని తాను చేస్తుందని, ఎవరికీ అనుమానాలు అవసరం లేదని స్పష్టీకరణ
- సర్వే ప్రక్రియ కారణంగా ఇంటింటికీ ప్రచారం కార్యక్రమం జులై 10కి వాయిదా
- కూటమి బంధం దీర్ఘకాలం కొనసాగుతుందని, అంతా కూటమి ధర్మానికి కట్టుబడాలని సూచన

### భూమయ్యగారిపల్లెలో వైఎస్ జగన్‌పై

# వెల్లువెత్తిన అభిమానం

2లో

## గ్రామస్తుల ఇష్టదైవ సన్నిధిలో ప్రత్యేక పూజలు

- గజమాలతో ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు
- వృద్ధుల ఆప్యాయత, చిన్నారులకు నామకరణం.. అక్షరాభ్యాసం
- తిరుగు ప్రయాణంలో కాన్వాయ్ ఆపి అంబులెన్స్‌కు దారి
- రాబోయేది మన ప్రభుత్వమే అంటూ పార్టీ శ్రేణులకు భరోసా
- భావోద్వేగాలు, ప్రజా ప్రేమకు నిదర్శనంగా నిలిచిన పర్యటన

కడప: వైఎస్సార్ కడప జిల్లా భూమయ్యగారిపల్లెలో అభిమాన జనం పోటెత్తారు. తమ ఇష్ట దైవం గట్టు శ్రీలక్ష్మీ నరసింహా స్వామి దేవాలయం ప్రారంబోత్సవంలో అభిమాన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటున్నారనే విషయం తెలుసుకొని ప్రజలు భారీగా తరలివచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్



# మాదక ద్రవ్యాలపై కన్నెర్ర

## ఈ నెల 26న అమిత్‌షా అధ్యక్షతన నార్కో--కోఆర్డినేషన్ సమావేశం

## హాజరు కానున్న 44 మంత్రిత్వ శాఖలు, అన్ని రాష్ట్రాల అధికారులు

న్యూఢిల్లీ: దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పంలో భాగంగా కేంద్ర ప్రభు త్వం మరిన్ని కఠిన చర్యలకు శ్రీకారం చుడుతోంది.



# జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రారంభం..

- తొలి బంగారం రాష్ట్రంలోని జ్యూయలరీ సంస్థలకు అందించిన చంద్రబాబు
- కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారు గనుల ప్రాజెక్టు ప్రారంభం
- ప్రాజెక్టును ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- తొలి బంగారాన్ని రాష్ట్రంలోని జ్యూయలరీ సంస్థలకు అందజేత
- ఏపీలో ఉత్పత్తి అయ్యే బంగారం ఇక్కడే విక్రయిస్తామన్న జియోమైసూర్
- స్థానిక యువతకు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సీఎం

కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారు గనుల ప్రాజెక్టు బుధవారం లాంఛనంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును ప్రారంభించి, ఇక్కడ ఉత్పత్తి అయిన తొలి బంగారాన్ని రాష్ట్రంలోని జ్యూయలరీ సంస్థలకు అందించారు. మన రాష్ట్రంలో వెలికితీసిన వనరుల ప్రయోజనాలు మన రాష్ట్రంలోని వారికే దక్కాలనే లక్ష్యంతో



2లో

# 'ఎస్ఐఆర్'పై సీఎం రేవంత్ ఫోకస్..

## నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్!

- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ హెచ్చరిక
- నిర్లక్ష్యం చేస్తే ఇన్‌చార్జ్‌ల మార్పు తప్పదని స్పష్టం
- పది రోజుల పాటు నేతల పనితీరుపై నిఘా
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచన
- పేదల ఓటు హక్కులను కాపాడాలని పిలుపు

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలక అంశంగా పరిగణిస్తోంది. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే నేతలపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్‌పై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాల నుంచి నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..


## జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రారంభం..

ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా, తొలి విడత బంగారాన్ని వాసవీ జ్యూయలర్స్, సాయి సంతోష్ జ్యుయలర్స్, మధుమూర్తి జ్యుయలర్స్, ఎమరాల్డ్ జ్యుయలర్స్ సంస్థలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా అందజేశారు. ఈ ప్రాజెక్టును నిర్వహిస్తున్న జియోమైసూర్ సంస్థ, ఇక్కడ వెలికితీసిన బంగారాన్ని రాష్ట్రంలోని వ్యాపారులకే విక్రయిస్తామని స్పష్టం చేసింది. స్థానిక ఆర్థిక వ్యవస్థకు మేలు చేకూరేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ కార్యక్రమానికి ముందు, మైనింగ్ ప్రాంతంలో భారీ వాహనాలు నడిపేందుకు మహిళలు, యువతకు శిక్షణ ఇచ్చే సిమ్యులేటర్ కేంద్రాన్ని సీఎం సందర్శించారు. అనంతరం, ఖనిజంతో కూడిన మట్టిని తరలించే భారీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ ప్రాజెక్టుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

## మాదక ద్రవ్యాలపై కన్నెర్ర

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన ఈనెల 26న ఢిల్లీలో నార్కో--కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్‌డీ) 10వ అత్యున్నత స్థాయి సమావేశం జరగనున్నట్లు ప్రభుత్వం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) నిర్వహిస్తున్న ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన 44 మంత్రిత్వ శాఖలు, విభాగాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు, మాదకద్రవ్య నియంత్రణ సంస్థలకు చెందిన 108 మంది ప్రతినిధులు ప్రత్యక్షంగా, వర్చువల్ విధానంలో పాల్గొంటారు.

**విజన్ డాక్యుమెంట్ విడుదల**

ఎన్‌సీఓఆర్‌డీ సమావేశ సందర్భంగా అమిత్ షా 'నార్కోటిక్స్ కంట్రోల్ విజన్ డాక్యుమెంట్ 2026--2029'ను విడుదల చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలు, మాదకద్రవ్య నిరోధక సంస్థలు, ఇతర భాగస్వాములతో విస్తృత సంప్రదింపుల అనంతరం ఈ పత్రాన్ని రూపొందించారు. మాదకద్రవ్యాల డిమాండ్ తగ్గింపు, సరఫరా నియంత్రణ, వ్యసన బాధితులకు పునరావాసం వంటి అంశాలకు సంబంధించిన సమగ్ర కార్యా చరణ ప్రణాళికను ఇందులో పొందుపరిచారు. ముఖ్యంగా సింథటిక్ డ్రగ్స్, డార్క్‌నెట్ ద్వారా జరిగే అక్రమ రవాణా, యువతను మాదకద్ర వ్యాలకు దూరంగా ఉంచడం, చికిత్సా, పునరావాస కేంద్రాల విస్తరణ వంటి అంశాలపై వచ్చే మూడు సంవత్సరాలకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించారు. దేశవ్యాప్తంగా విధాన రూపకల్పన, అమలు, సంస్థాగత బలోపేతానికి ఈ విజన్ డాక్యుమెంట్ మార్గదర్శకంగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ సందర్భంగా అమిత్ షా 'ఎన్‌సీబీ వార్షిక నివేదిక--2025'ను కూడా విడుదల చేయనున్నారు. అలాగే జమ్మూ, గౌహతిలో నూతనంగా నిర్మించిన ఎన్‌సీబీ జోనల్ కార్యాలయాలను ప్రారంభించనున్నారు.

**రూ.6 వేల కోట్ల విలువైన డ్రగ్స్ ధ్వంసం**

దేశవ్యాప్తంగా డ్రగ్స్ నిర్మూలనకు చేపట్టిన ప్రత్యే క 'ఆన్‌లైన్ డ్రగ్ డిస్పోజల్ ఫోర్ట్‌నైట్ క్యాంపెయిన్'ను కూడా కేంద్ర హోంమంత్రి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 2,09,500 కిలోల మాదకద్రవ్యాలను ధ్వంసం చేయనున్నాయి. వీటి అంచనా విలువ 6 వేల కోట్లు అని ప్రభుత్వం తెలిపింది. దేశంలో మాద కద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై ఎన్‌సీఓఆర్‌డీ సమావేశంలో సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు, డ్రగ్స్ నియంత్రణ అమలు సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, రాబోయే మూడు సంవత్సరాల కార్యాచరణపై చర్చ జరగనుంది.

## సుర్వి నరసింహా గౌడ్‌కు ఘన సన్మానం

**- పార్టీకి అందించిన సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం సేవలందించి, నూతన కమిటీ ఎన్నికల నేపథ్యంలో పదవీ విరమణ పొందిన సుర్వి నరసింహ గౌడ్‌ను లక్కారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుర్వి నరసింహ గౌడ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో, కింది స్థాయి కార్యకర్తలను ఏకం చేయడంలో సుర్వి నరసింహ గౌడ్ అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. పదవులు మారినా పార్టీ పట్ల, ప్రజల పట్ల బాధ్యత మారదని, సీనియర్ నాయకుల అనుభవాలను పరిగణనలోకి తీసుకొని నూతన కమిటీలు ముందుకు సాగాలని సూచించారు. ఇందిరమ్మ ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకూ చేర్చడంలో పాత, కొత్త నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణుల సంక్షేమానికి, నియోజకవర్గ అభివృద్ధికి సుర్వి నరసింహ గౌడ్ నిరంతరం శ్రమించారని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఓటరు వివరాల సేకరణ నేటి నుంచి షురూ

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్)--2026లో భాగంగా గురువారం నుంచి రాష్ట్రంలోని ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం..జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటా తిరిగి ప్రతి ఓటరుకు ఒక జత ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయనున్నారు. ఫారంపై సంబంధిత ఓటరు పేరు, ఎపిక్‌కార్డు సంఖ్య, చిరునామా, ఫొటో, తదితర పాక్షిక వివరాలు ముద్రించి ఉండనున్నాయి. మిగిలిన వివరాలతో రెండు ప్రతులను పూరించాక వాటిపై బీఎల్ఓ సంతకం చేసి ఒక ప్రతిని ఓటరుకే రశీదుగా ఇచ్చి మరో ప్రతిని తనతో పాటు తీసుకెళ్తారు. ఈ విధంగా ఓటర్లు వివరాలు భర్తీ చేసి తమ సంతకం/వేలి ముద్రతో జూలై 24 లోగా బీఎల్ఓలకు తిరిగి అప్పగిస్తేనే జూలై 31న ప్రచురించే ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు రానుంది.

**మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు..**

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, ప్రతి ఒక్క ఓటరుకు పంపిణీ చేసేందుకు జత ఎన్యూమరేషన్ ఫారాలను ఇప్పటికే ముద్రించి బీఎల్ఓలకు సరఫరా చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఆంగ్లంలో, మిగిలిన జిల్లాల్లో తెలుగులో ప్రచురించిన ఎన్యూమరేషన్ ఫారాన్ని ఓటర్లకు పంపిణీ చేయనున్నారు. ఓటరు స్థానికంగా అందుబాటులో లేకపోతే అతడి ఎన్యూమరేషన్ ఫారాన్ని కుటుంబ పెద్ద భర్తీ చేసి సంతకం పెట్టి బీఎల్ఓకు ఇవ్వవచ్చు. పోలింగ్ కేంద్రాల వారీగా సర్ ముసాయిదా ఓటర్ల జాబితాను జూలై 31న ప్రచురిస్తారు. ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించడంలో విఫలమైన ఓటర్లను గైర్హాజరు/నివాసం మారడం/చనిపోయిన/డూప్లికేట్ ఓటర్లుగా పరిగణించి వారి పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తారు. ఇలా తొలగించిన ఓటర్ల జాబితాలను సైతం పోలింగ్ కేంద్రాల వారీగా ప్రచురించి స్థానిక గ్రామ పంచాయతీ/వార్డు కార్యాలయంతో పాటు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాల (ఫామ్--7)తో పాటు కొత్తగా ఓటర్లుగా నమోదు (ఫామ్--6), వివరాల దిద్దుబాటు/చిరునామా మార్పు (ఫామ్--8) కోసం జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ముసాయిదా జాబితాలో పేరు రాకపోయినా లేదా అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన/నిండనున్న యువత ఓటర్లుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 మధ్యకాలంలో ఈ దరఖాస్తులు, అభ్యంతరాలను పరిష్కరించడంతో పాటు మ్యాపింగ్ సరిపోలని అనుమానిత ఓటర్లకు ఈఆర్ఓ (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్)లు నోటీసులు జారీ చేసి నిర్దిష్ట తేదీలో విచారణకు పిలుస్తారు.

**11 పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలి**

రాష్ట్రంలోని 3.38 కోట్ల మంది ఓటర్లలో ఇప్పటివరకు 2.38 కోట్ల మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తికాగా, మ్యాపింగ్ జరిగిన ఓటర్లలో 89.98 లక్షల మంది ఓటర్ల వివరాల్లో తేడాలున్నట్టు గుర్తించారు. వీరందరూ విచారణకు హాజరై ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని సమర్పించి తమ పుట్టిన తేదీ/నివాస ధ్రువీకరణ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ జాబితాలో 12వ ధ్రువీకరణ పత్రంగా ఆధార్‌ను ఈసీ చేర్చినా, పుట్టిన తేదీ/నివాస ధ్రువీకరణ కోసం పరిగణనలోకి తీసుకోరు. కేవలం గుర్తింపునకు ధ్రువీకరణగానే ఆధార్‌ను స్వీకరించనున్నారు. ఈసీ నిర్దేశించిన పత్రాల్లో ఏ ఒక్క పత్రం లేని ఓటర్లు వారికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఇతర ధ్రువీకరణ పత్రాలను సైతం సమర్పించవచ్చు. అయితే వాటి స్వీకరణ పూర్తిగా ఈఆర్వోల విచక్షణాధికారాలపై ఆధారపడి ఉంటుంది. అభ్యంత నిర్ణయాలకు అనుగుణంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసి అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.

## 'ఎస్ఐఆర్'పై సీఎం రేవంత్ ఫోకస్..

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే పది రోజుల పాటు నేతల పనితీరును పరిశీలిస్తామని, అలసత్వాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.గ్రామీణ స్థాయిలో అవగాహన పెంచడంలో సర్పంచ్‌లు కూడా చురుగ్గా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ అంశం చాలా సున్నితమైనదని, కొందరు నాయకులు దీన్ని తేలిగ్గా తీసుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా వారీగా నివేదికలు తనకు అందాయని, పార్టీకి నష్టం కలిగే పరిస్థితులను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు.ప్రతి నియోజకవర్గంలో మరిన్ని అవగాహన సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. ముఖ్యంగా పేదల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటు కోల్పోతే ఇతర ప్రభుత్వ పథకాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని అన్నారు.రాష్ట్రంలో ఎన్నికల సంఘం గురువారం నుంచి ఇంటింటి ఓటరు ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ తమ తమ కార్యాచరణను ముమ్మరం చేస్తున్నాయి.

## తెలంగాణలో హిట్లర్ పాలన

రక్షణగా నిలవాల్సింది పోయి, ల్యాండ్ గ్రాబర్‌గా వ్యవహరిస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. రఘునాథపాలెంలో ఇళ్ల స్థలాల నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రఘునాథపాలెం పరిధిలోని సర్వే నంబర్ 218లో 625 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేసి, గృహలక్ష్మి పథకం కింద లబ్ధి చేకూర్చామని ఆయన గుర్తుచేశారు. నిరుపేదలు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడితే, ప్రస్తుత ప్రభుత్వం జేసీబీలతో వాటిని కూల్చివేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన చింతకాని మండలంలో నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'ను 'రైతుల క్షమాపణ సభ'గా మార్చుకోవాలని హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

## రాయదుర్గం భూముల వివాదానికి ముగింపు.. వెనక్కి తగ్గిన ఎస్‌బీఐ?

గత కొన్ని రోజులుగా తెలంగాణ ప్రభుత్వం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మధ్య చర్చనీయాంశంగా మారిన రాయదుర్గం భూవివాదం పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇరు వర్గాల మధ్య జరిగిన వరుస చర్చల తర్వాత ఉద్రిక్తతలు తగ్గినట్లు సమాచారం. తాజాగా ఎస్‌బీఐ తీసుకున్న నిర్ణయాలతో ఈ వ్యవహారం త్వరలోనే ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఎస్‌బీఐ సానుకూలంగా స్పందించింది. ఈ భూముల వ్యవహారానికి సంబంధించి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకోవడానికి బ్యాంక్ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో వివాదాస్పద భూమికి బదులుగా ప్రభుత్వం సూచించిన 2.5 ఎకరాల ప్రత్యామ్నాయ స్థలాన్ని స్వీకరించేందుకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) అధికారులు, ఎస్‌బీఐ ప్రతినిధుల మధ్య మరోసారి సమావేశం జరగనుంది. ఈ భేటీలో మిగిలిన అంశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. చర్చలు సానుకూలంగా ముగిస్తే భూ వివాదానికి పూర్తిస్థాయిలో తెరపడే అవకాశం ఉంది. ఇక ఈ వివాదం కారణంగా ఎస్‌బీఐపై తెలంగాణ ప్రభుత్వం గతంలో కఠిన వైఖరి అవలంబించింది. ప్రభుత్వ శాఖలకు చెందిన పలు లావాదేవీల విషయంలో పరిమితులు విధిస్తూ అంతర్గతంగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ వ్యవహారం రాజకీయ, ఆర్థిక వర్గాల్లో కూడా చర్చకు దారితీసింది. అయితే ఇప్పుడు పరిస్థితి మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎస్‌బీఐ వైఖరిలో మార్పు రావడంతో ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. బ్యాంక్‌తో కొనసాగుతున్న ప్రభుత్వ లావాదేవీలను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ప్రభుత్వ గ్రాంట్ల నిర్వహణతో పాటు ఎస్‌బీఐకి ఉన్న లీడ్ బ్యాంక్ హోదాను కూడా కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. హైకోర్టులో తదుపరి విచారణ పూర్తయిన తర్వాత ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అప్పటివరకు ఇరు పక్షాలు చర్చల ప్రక్రియను కొనసాగించే అవకాశముంది.

# కొందరు రిలాక్స్ అవుతున్నారు...

గొడ్డలి పార్టీ చేస్తున్న విష ప్రచారాన్ని, ఫేక్ వార్తలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని, అదే సమయంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి-సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విపక్షంలో ఉన్నప్పుడు ఎలా ఉన్నామో, ఇప్పుడూ అదే స్ఫూర్తితో ఉండాలని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా మోపిదేవిలో నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చాక కొందరు కార్యకర్తలు రిలాక్స్ అవుతున్నారని, ఇది కోవిడ్ కన్నా ప్రమాదకరమైన జబ్బు అని లోకేశ్ హెచ్చరించారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాడతాం, అధికారంలోకి రాగానే రిలాక్స్ అయిపోతాం. కష్టకాలాన్ని మర్చిపోకూడదు. చిన్న పొరపాటు జరిగినా అలిగి ఇంట్లో కూర్చోవడం వల్ల నష్టపోయేది టీడీపీ, ఆంధ్రప్రదేశ్ ప్రజలే" అని హితవు పలికారు. గొడ్డలి పార్టీ సృష్టించిన అడ్డంకులను అధిగమించి అధికారంలోకి వచ్చామని, ఈ స్ఫూర్తిని మరువొద్దని సూచించారు.

గత ప్రభుత్వంలో బూతుల మంత్రులు కృష్ణా జిల్లా పరువు తీశారని, కార్యకర్తలను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. "మహనీయులు పుట్టిన ఈ జిల్లాలో ఒక బూతుల మంత్రి, ఇంకొకరు కార్యకర్తలను వేధించేవారు. భువనేశ్వరమ్మ గారిని కూడా అవమానించారు. వారి పేర్లను ఎర్రబుక్కులో రాస్తున్నానని ఆనాడే చెప్పాను. రెడ్ బుక్ తన పని తాను చేస్తుంది, దానిపై ఎవరికీ అనుమానాలు అవసరం లేదు" అని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని లోకేశ్ వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4,000 పింఛను, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం కింద 3 సిలిండర్లు, తల్లికి వందనం రెండో విడత వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,000 టీచర్ పోస్టులు, జాబ్ క్యాలెండర్ ద్వారా 10,000 ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేదని, ఆ పనులకే రూ.2,000 కోట్లు ఖర్చయిందని విమర్శించారు. వైసీపీ అబద్ధాన్ని కూడా నిజమని నమ్మించే ఫేక్ పార్టీ అని, వారి తప్పుడు ప్రచారాన్ని గ్రామ, మండల స్థాయిలో ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. "ఎస్ఐఆర్" ప్రక్రియ కొనసాగుతున్నందున 'ఇంటింటికీ ప్రచారం' కార్యక్రమాన్ని జులై 10వ తేదీ నుంచి ప్రారంభిస్తామని లోకేశ్ ప్రకటించారు. బీజేపీ-జనసేన-టీడీపీ కూటమి బంధం దీర్ఘకాలం కొనసాగుతుందని, "నో మిస్ ఫైర్, నో క్రాస్ ఫైర్, నో విడాకులు" అన్నదే తమ విధానమని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఇతర నేతలు పాల్గొన్నారు.

## నల్లగొండకు సిటీ బస్సు సర్వీసులు

**లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి**

నల్లగొండ,జూన్: నల్లగొండలో సిటీ బస్సు సేవలను రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని మహిళలు షాపింగ్, ఇతర అవసరాల కోసం రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిటీ బస్సు సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే మెడికల్ కాలేజీ విద్యార్థులు ఆస్పత్రికి చేరుకోవడానికి ఆటోలపై ఆధారపడాల్సి వచ్చేదని, ఇకపై వారు సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంటుందని చెప్పారు. బుధవారం కోటి 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, ఆధునికీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తొలుత 2 సిటీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిటీ బస్సు సర్వీసులు చెరువుగట్టు-ఎస్ఎల్‌బీసీ మార్గంతో పాటు ధర్వేశిపురం నుండి దుప్పలపల్లి వరకు నడిచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. నల్లగొండకు అదనంగా 30 బస్సులు కేటాయించడం జరిగిందని, 56 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బీసీ వద్ద పెట్రోల్ పంపు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.



## రైతు సంక్షేమమే మా ప్రాధాన్యం!

- మడిపోని 'రేపాక' రైతుల శ్రమ.. రెట్టింపు పరిహారం అందించిన ప్రభుత్వం
- ఇండస్ట్రియల్ పార్క్ భూ బాధితులకు ఎకరాకు రూ. 12 లక్షల చెక్కులు
- రైతుల ముఖాల్లో ఆనందం చూస్తుంటే సంతోషంగా ఉంది: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్

**తొలివెలుగు, యాదాద్రి భువనగిరి మున్సిపాలిటీ:** భూములు కోల్పోతున్న పేద రైతుల జీవనోపాధిని దెబ్బతీయకుండా, వారికి అండగా నిలవడమే తమ ప్రభుత్వ ధ్యేయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. అడ్డగూడూర్ మండలం రేపాక గ్రామ శివారులో నిర్మించ తలపెట్టిన ఇండిస్ట్రియల్ పార్క్ కోసం భూములిచ్చిన 10 మంది రైతులకు బుధవారం కలెక్టరేట్‌లో భారీ పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి ఎమ్మెల్యే రైతులకు ఎకరాకు రూ. 12 లక్షల చొప్పున పరిహారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత నిబంధనల ప్రకారం రైతులకు ఎకరాకు రూ. 6 లక్షలు మాత్రమే వచ్చే పరిస్థితి ఉండేదన్నారు. కానీ తరతరాలుగా భూమినే నమ్ముకున్న రైతన్నలకు అన్యాయం జరగనివ్వకూడదనే ఉద్దేశంతో తాను కలెక్టర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి, పరిహారాన్ని రెట్టింపు (రూ. 12 లక్షలు) చేయించగలిగానని హర్షం వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణను వేగంగా పూర్తి చేసిన ఆర్డీఓ కృష్ణారెడ్డిని, సమన్వయం చేసిన మోత్కూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, స్థానిక సర్పంచ్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ. శేషగిరి రావు, డీటీ నరసింహారావు, నగేష్ కుమార్, ఆర్ఐ, జీపీఓ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- తహశీల్దార్‌కు మండల స్వర్ణకార సంఘం వినతి
- జీఓ 272 సవరణకు డిమాండ్



**తొలివెలుగు, అడ్డగూడూరు :** రాష్ట్రంలో స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని మండల స్వర్ణకార సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా స్వర్ణకార సంఘం పిలుపులో భాగంగా బుధవారం అడ్డగూడూరు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎ. శేషగిరిరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశ్వబ్రాహ్మణులు కీలక పాత్ర పోషించారన్నారు. రాష్ట్రం వస్తే బతుకులు మారుతాయని భావించినా.. ప్రస్తుతం తమ పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ నెంబర్ 272ను సవరించి పటిష్టంగా అమలు చేయడం ద్వారా స్వర్ణకారులను దొంగ బంగారం రికవరీ వేధింపుల నుండి కాపాడాలని కోరారు. అలాగే 50 ఏళ్లు నిండిన ప్రతి స్వర్ణకారునికి నెలకు రూ. 5 వేల చొప్పున పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం మండల అధ్యక్షుడు రాజుపేట రాజుబాబుచారి, ప్రధాన కార్యదర్శి శివకోటి సత్యనారాయణ చారి, ఉపాధ్యక్షుడు తొగిటి బ్రహ్మానందసాగర్ చారి, కోశాధికారి చిట్లోజు లక్ష్మణాచారి, సహాయ కార్యదర్శి శివకోటి వేణు చారి, కార్యవర్గ సభ్యులు వెంకటరమణ చారి, ఉల్లి వెంకటచారి, మారోజు శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో 'పీర్ల' కోలాహలం!

- పోచంపల్లి వ్యాప్తంగా ముమ్మరంగా మొహర్రం వేడుకలు
- ?పురవీధుల్లో ఊరేగింపు.. భక్తుల మొక్కులు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండలంతో పాటు పట్టణ కేంద్రంలో మొహర్రం పండుగ ముందస్తు వేడుకల సందడి నెలకొంది. ఈనెల 26న మొహర్రం పండుగ పురస్కరించుకుని బుధవారం అషూర్ ఖానాల నుంచి పీర్లను వెలుపలికి తీశారు. డప్పు వాయిద్యాల చప్పుళ్ల మధ్య గ్రామాలు, పట్టణంలోని పురవీధుల్లో పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. భక్తులు పీర్ల వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి, తమ మొక్కులను చెల్లించుకున్నారు.



## ధర్మోజిగూడెంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

- రూ.15 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మాణం
- గ్రామాల అభివృద్ధే ధ్యేయం: ఉబ్బు వెంకటయ్య, జువ్వి నర్సింహ్మా



**తొలివెలుగు, చౌటుప్పల్:** గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా అంచెలంచెలుగా అన్ని రంగాల్లో ముందంజలో నిలుపుతామని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, గ్రామ సర్పంచ్ జువ్వి నర్సింహ్మా పేర్కొన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఇజిఎస్) నిధులు రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం వారు శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాధాన్యత క్రమంలో గ్రామంలోని అంతర్గత రహదారులన్నింటినీ ఆధునీకరిస్తామన్నారు.

ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందంటూ, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలు విజయవంతంగా అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫక్కీరు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, సామిడి సంధ్య, ఐతరాజు శారద లింగస్వామి, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ, గునుగంటి వెంకటేశం, జంగం వెంకటమ్మ, మాజీ ఉప సర్పంచ్‌లు బత్తుల శ్రీహరి, కొంతం బుచ్చిరెడ్డి, నాయకులు బద్రి లింగయ్య, ఐతరాజు సత్తయ్య, రాచకొండ కృష్ణయ్య, సామిడి లింగారెడ్డి, ఊదరి లింగయ్య, రాచకొండ వెంకటేశం, ఊదరి స్వామి, గునుగంటి స్వామి, చెన్నోజు భూషణాచారి, బోనకుర్తి హరికృష్ణ, ఊదరి రవి, జంగం అంజయ్య, ఐతరాజు రవీందర్, బత్తుల సింహాచలం, కొంతం శ్రీనివాస్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు, కాలనీ వాసులు, గ్రామస్తులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందాలి!



- ఎయిమ్స్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి సమీక్ష
- రోగుల కోసం లైజన్ అధికారుల నియామకం
- 'స్వస్తి' యాప్, టెలిమెడిసిన్ సేవలను ఉపయోగించుకోవాలి

**తొలివెలుగు, భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రజలకు మరింత నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులు, ఎయిమ్స్ బీబీనగర్ మధ్య సమర్థవంతమైన రిఫరల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్‌లో ఎయిమ్స్ బీబీనగర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ఎయిమ్స్‌కు రిఫర్ అయ్యే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా కార్డియాలజీ, నెఫ్రాలజీ, క్యాన్సర్ చికిత్స, హైరిస్క్ గర్భిణీలకు ప్రత్యేక వైద్య సేవలు, రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర చికిత్స, క్రిటికల్ కేర్ యూనిట్లు, డయాగ్నస్టిక్ సేవలు, స్కానింగ్, బ్లడ్ బ్యాంక్, ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ సేవల విస్తరణపై అధికారులు చర్చించారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ఎయిమ్స్‌కు రిఫర్ అయ్యే రోగుల సమన్వయం కోసం ప్రతి ఆసుపత్రిలో ప్రత్యేక లైజన్ అధికారులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఎయిమ్స్ తరఫున జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో కూడా ఒక లైజన్ అధికారిని నియమించి రోగులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. సమావేశంలో ఎయిమ్స్‌లో అందుబాటులో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఓపీ సేవలు, చికిత్సా విధానాలు, హైరిస్క్ గర్భిణీలకు అందించే సేవలు, రిఫరల్ ప్రక్రియపై



సమీక్షించారు. అలాగే ఎయిమ్స్ అందిస్తున్న 'సంజీవిని' టెలిమెడిసిన్ సేవల ద్వారా నిపుణుల వైద్య సలహాలు పొందవచ్చని వివరించారు. ప్రజలకు ఉపయోగకరంగా ఉండే 'స్వస్తి' యాప్‌ను మొబైల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, ఎయిమ్స్ ఆసుపత్రికి 500 మీటర్ల పరిధిలో ఉన్నప్పుడు ముందుగానే ఓపీ టోకెన్ బుక్ చేసుకోవడం ద్వారా వేగవంతమైన వైద్య సేవలు పొందవచ్చని అధికారులు తెలిపారు. ఎయిమ్స్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ప్రజలకు విస్తృత స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎం. మనోహర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కొండల్ రెడ్డి, డీసీహెచ్ఎస్ డా. సూర్యశ్రీ రావు, ఎయిమ్స్ ప్రొఫెసర్లు, వైద్యులు, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

- కక్కిరేణి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సత్కారం
- దాతల సహకారంతో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి: హెచ్ఎం రాజన్‌బాబు

**తొలివెలుగు, రామన్నపేట :** మండలంలోని కక్కిరేణి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన ప్రతిభావంతులకు బుధవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. బెస్ట్ సేవా సొసైటీ ఉపాధ్యక్షుడు మిర్యాల రామకృష్ణ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు ఈ అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు సిహెచ్. రాజన్‌బాబు మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరుగుతోందని, విద్యార్థులు అద్భుతమైన నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులకు మరింత ప్రోత్సాహం అందిస్తే జిల్లా, రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. గ్రామీణ విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు వచ్చి విద్యా సామాగ్రిని అందిస్తే మండలానికి మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. ఉపేందర్, జీ ఆర్గనైజర్ వేముల సైదులు, ఉపాధ్యాయులు భద్రయ్య, శ్రీనివాసరావు, శేఖర్‌రెడ్డి, రమేష్, జ్యోతి, విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## వ్యసనాలకు దూరంగా ఉండి.. జీవితాలను చక్కదిద్దుకోవాలి







- జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి లత
- అరోరా వర్సిటీలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి రూరల్ :** యువత ఫ్యాషన్ కోసమో, మానసిక ఒత్తిడి దూరం చేసుకోవడానికో అలవాటు చేసుకునే మాదక ద్రవ్యాల వల్ల జాతీయ సంపద అయిన వారి జీవితాలు నాశనమవుతున్నాయని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి. మాధవి లత ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిషేధ దినోత్సవం, అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా బుధవారం అరోరా యూనివర్సిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, డ్రగ్ అవేర్నెస్ అండ్ ప్రొటెక్టివ్ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఒక్కసారి డ్రగ్స్ కేసుల్లో చిక్కుకుంటే చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. జాతీయ న్యాయ సేవా సంస్థ 'డ్రగ్ అవేర్నెస్, వెల్నెస్ నావిగేషన్' పథకం ద్వారా బాధితులకు అండగా ఉంటోందని, ఇందుకోసం ప్రత్యేక జిల్లా యూనిట్ పనిచేస్తోందని తెలిపారు. ర్యాగింగ్, యాసిడ్ దాడులు అనాగరిక చర్యలని.. వీటికి పాల్పడితే కాలేజీల నుంచి డీబార్ చేయడంతో పాటు కఠిన శిక్షలు ఉంటాయన్నారు. బాధితులకు న్యాయ సహాయంతో పాటు నష్టపరిహారం కూడా అందిస్తామని వివరించారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి మాట్లాడుతూ.. డ్రగ్స్ రవాణాపై ముమ్మరంగా తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. భువనగిరి డీఎస్పీ బి. రవీందర్ మాట్లాడుతూ.. యువత నేర ప్రవృత్తిని, వ్యసనాలను వీడాలన్నారు. జిల్లా మానసిక ఆరోగ్య ప్రాజెక్ట్ అధికారి డా. ప్రీతి స్వరూప్ డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అరోరా వర్సిటీ డైరెక్టర్ డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తమ సంస్థ క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తోందన్నారు. అనంతరం డ్రగ్స్ నష్టాలపై లఘు చిత్రాల ప్రదర్శన, ఎక్సైజ్ గోడ పత్రికల ఆవిష్కరణ చేశారు. విద్యార్థిని అపర్ణ పాడిన ప్రేరణ గీతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు వికాస్, రాధాకిషన్, బాలోజీ నాయక్, న్యాయవాదులు సాయి శ్రీనివాస్, వెంకటేష్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఆలయ మార్గంలో అక్రమంగా మట్టి పోతలు!

**- కుంచించుకుపోతున్న నిదానపల్లి - తుమ్మలగూడెం బీటీ రోడ్డు**

– వాహనదారుల ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు



**తొలివెలుగు, రామన్నపేట :** మండలంలోని నిదానపల్లి గ్రామంలో గల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం మీదుగా తుమ్మలగూడెం, వలిగొండ వెళ్లే బీటీ రహదారిపై అక్రమ మట్టి పోతలతో ముప్పు నెలకొంది. రహదారికి ఆనుకుని ఉన్న కొందరు వ్యవసాయ భూముల యజమానులు తమ పొలాల్లోని మట్టిని రోడ్డు అంచుల వరకు భారీగా అచ్చుకట్టడంతో రోడ్డు హద్దులు క్రమంగా కుదించుకుపోతున్నాయని ప్రయాణికులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆలయానికి వెళ్లే ప్రధాన మార్గంలోనే మట్టిని రోడ్డుపైకి వచ్చేలా పోయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో ఈ మట్టి రోడ్డుపైకి జారి, బైక్‌లపై వెళ్లే వాహనదారులు జారిపడి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిదానపల్లి గుట్టపై ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లికార్జున స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న తరుణంలో ఈ రహదారి విస్తరణ ఎంతో కీలకంగా మారింది. అయితే, ఇప్పుడు రోడ్డు హద్దుల వరకు మట్టి పోయడం వల్ల భవిష్యత్తులో రోడ్డు వెడల్పు పనులకు తీవ్ర ఆటంకం కలిగే పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు క్షేత్రస్థాయిలో స్పందించి, రహదారి హద్దులను పరిశీలించి, రోడ్డుపై ఉన్న మట్టిని తక్షణమే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





# తాజ్‌పూర్ బడి.. ఇక కార్పొరేట్‌కు పోటీ!

- సొంత ఖర్చు రూ. 16 లక్షలతో స్కూలును మార్చేసిన సర్పంచ్
- డిజిటల్ స్క్రీన్లు, కంప్యూటర్ ల్యాబ్, వైఫై, ఆటో సౌకర్యం ఏర్పాటు
- బడి పునఃప్రారంభ వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఈఓ భిక్షపతి

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి :** సొంతూరిపై మమకారంతో ఓ ప్రజాప్రతినిధి చేసిన ఆలోచన.. ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల రూపురేఖలనే మార్చేసింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడిని తీర్చిదిద్ది అందరికీ ఆదర్శంగా నిలిచారు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్. సర్పంచ్ తన సొంత నిధులు రూ. 16 లక్షలు వెచ్చించి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కల్పించిన అధునాతన వసతుల ప్రారంభోత్సవం, పాఠశాల పునఃప్రారంభ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, జిల్లా విద్యాధికారి (డీఈఓ) భిక్షపతి ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి సౌకర్యాలను ప్రారంభించారు.

**కార్పొరేట్ పాఠశాల తరహాలో సదుపాయాలు:**
గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ చొరవతో ఈ ప్రభుత్వ పాఠశాల ఇప్పుడు కార్పొరేట్ విద్యాసంస్థలను తలపిస్తోంది. సర్పంచ్ తన సొంత ఖర్చులతో పాఠశాలలో అధునాతన కంప్యూటర్ ల్యాబ్, ఎల్ఈడీ డిజిటల్ క్లాస్ స్క్రీన్లు, వైఫై సదుపాయం, భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. విద్యార్థుల కోసం అత్యాధునిక శైలిలో టాయిలెట్లు, ఆర్వో ప్యూరిఫైడ్ సురక్షిత రక్షిత మంచినీటి ప్లాంట్, నూతన నాణ్యమైన ఫర్నిచర్, విశాలమైన వంటగదిని నిర్మించారు. విద్యార్థులను ఆకట్టుకునేలా క్లాస్ రూముల్లో విద్యా విజ్ఞాన చిత్రపటాలు, పాఠశాల ఆవరణలో ఆహ్లాదకరమైన గ్రీనరీ, మొక్కలు, క్రీడా సామాగ్రి, సమావేశాల కోసం ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు ఆటో సౌకర్యం కల్పించడంతో పాటు, అదనపు వాలంటీర్ టీచర్‌ను కూడా నియమించారు. ఈ మార్పులతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

**అందరికీ ఆదర్శం..**
ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ శోభారాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సర్పంచ్ సంతోష శ్రీనివాస్ చేసిన కృషి అభినందనీయమని, వారిని మిగతా ప్రజాప్రతినిధులు ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. డీఈఓ భిక్షపతి మాట్లాడుతూ.. నాణ్యమైన వసతులు కల్పించడం వల్ల పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తీ, సామాజిక వేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, ఎంఈఓ రంగరాజన్, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# బస్సు సౌకర్యం కల్పించాలి





**- రామన్నపేట - అమ్మనబోలు రూట్లో ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని డిమాండ్**

**- రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు.. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో**

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట–అమ్మనబోలు రూట్లో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసును తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రామన్నపేటలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ఈ రూట్లో బస్సు నడవకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుబ్బాక, మునిపంపుల, పల్లివాడ, ఎన్నారం, అమ్మనబోలు సహా తొమ్మిది గ్రామాల పరిధిలోని దాదాపు 500 మంది విద్యార్థులు రామన్నపేటలోని వివిధ విద్యాసంస్థలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడం శోచనీయమన్నారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తూ రోజుకు రూ.100 వరకు అదనపు భారం మోస్తున్నారని, కొందరు చదువు మానేసే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించకుంటే కలెక్టరేట్ ముట్టడికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు పెద్ది అక్షిత, నాయకులు నవీన్, అభిరూప్, యశ్వంత్, ప్రవీణ్, లోకేష్, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ పేరు పెట్టడం సమంజసం కాదు

**- నానక్రామ్‌గూడ రోడ్డు పేరును ఉపసంహరించుకోవాలి**

**- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య డిమాండ్**

**తొలివెలుగు, చౌటుప్పల్:** నగరంలోని నానక్రామ్‌గూడ రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు పెట్టడాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య తప్పుబట్టారు. బుధవారం స్థానిక కందాల రంగారెడ్డి స్మారక భవనంలో బూరుగు కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, ఇక్కడి ప్రజల పోరాటాలు, మహనీయుల సేవలను స్మరించుకుంటూ రోడ్లకు పేర్లు పెట్టాలే తప్ప.. మన చరిత్రతో ఎలాంటి సంబంధం లేని విదేశీ నాయకుల పేర్లు పెట్టడం తగదన్నారు. ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా ఇలాంటి నిర్ణయాలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వీరయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రజా ఉద్యమాలకు, సమాజానికి సేవలందించిన మహనీయుల పేర్లను పెట్టాలని, ట్రంప్ పేరును ప్రభుత్వం వెంటనే పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, నాయకులు శ్రీనివాస చారి, ఎండి పాషా, గంగాదేవి సైదులు, రాగిరి కిష్టయ్య, గోశిక కరుణాకర్, మధు, పొట్ట శ్రీను, బోయ యాదయ్య, పల్లె మధు కృష్ణ, తడక మోహన్, తూర్పునూరి మల్లేశం, బొడ్డు అంజిరెడ్డి, గుణముని ఐలయ్య, ఈ దయ, జంగయ్య, రాములు, మహేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.




# రైల్వే ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి

- గుంటూరు డీఆర్ఎంతో భేటీ అయిన కాంగ్రెస్ నేత వనం హర్షిని చంద్రశేఖర్
- రామన్నపేటలో పలు రైళ్ల నిలుపుదలకు వినతి



**తొలివెలుగు, రామన్నపేట:** రైల్వే ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ వనం హర్షిని చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గుంటూరు రైల్వే భవన్‌లో నిర్వహించిన రైల్వే సర్వసభ్య సమావేశంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఆమె పాల్గొన్నారు. అనంతరం డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం)ను కలిసి ప్రయాణికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామన్నపేట, చిట్యాల, వలిగొండ, నాగిరెడ్డిపల్లి ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కరోనా సమయంలో నిలిపివేసిన నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, డెల్టా ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లను తిరిగి రామన్నపేట రైల్వే స్టేషన్‌లో నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రామన్నపేట, చిట్యాల, వలిగొండ, నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్లలో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉరుమడ్ల–నాగారం ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు నిర్మించడంతో పాటు ఎల్‌సీ నంబర్ 22, 23 వద్ద వర్షపు నీరు నిల్వ కాకుండా అండర్‌పాసులను నిర్మించాలని డీఆర్ఎంకు సూచించారు. అన్ని రైల్వే స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఆధునిక మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. అదేవిధంగా ప్రయాణికుల సౌకర్యార్థం రిజర్వేషన్ కౌంటర్లు, డిజిటల్ డిస్ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని, గుంటూరు రైల్వే డివిజన్‌ను సికింద్రాబాద్ డివిజన్‌లో విలీనం చేసే అంశాన్ని సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే అధికారులు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు హర్షిని చంద్రశేఖర్ తెలిపారు.





## సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలి

- కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తూర్కపల్లి సురేందర్ పిలుపు

**తొలివెలుగు, వలిగొండ:** సీఐటీయూ వలిగొండ మండల జనరల్ బాడీ సమావేశాన్ని జూలై 25న వలిగొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తూర్కపల్లి సురేందర్ తెలిపారు. ఈ సమావేశానికి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాసిందని విమర్శించారు. ఈ కోడ్‌ల వల్ల పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూరుతుండగా, కార్మికులు జీవితాంతం శ్రమ దోపిడీకి గురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని, తమ హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సురేందర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాధారపు మల్లేశ్, రాంనర్సయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఇందిరమ్మ'తోనే సొంతింటి కల సాకారం

- మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేశ్వర్లు
- పోచంపల్లిలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** సామాన్యుడి సొంతింటి కల కేవలం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారానే సాకారమవుతుందని మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పురపాలక కేంద్రంలోని 8వ వార్డులో నూకల శ్రీశైలం-సుజాత దంపతులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, కౌన్సిలర్ దేవరాయ కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, సామాన్యుల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రస్తుత ప్రజాపాలన సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కె. కరుణాకర్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ సుభాష్, కో-ఆప్షన్ మెంబర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు సామల రాజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, గంగాదేవి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా రూపకల్పనలో బిఎల్‌ఎల పాత్ర కీలకం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
- రఘునాథపురంలో బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశం

**తొలివెలుగు, రాజాపేట:** బలమైన ప్రజాస్వామ్య స్థాపన కోసం తప్పుల్లేని ఖచ్చితమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడంలో బూత్ స్థాయి ఏజెంట్ల (బిఎల్‌ఎ) పాత్ర ఎంతో కీలకమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం రాజాపేట మండలం రఘునాథపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్‌ఎలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి లేదా అర్హత లేని వారి పేర్ల తొలగింపు, తప్పుల సవరణ, చిరునామా ధ్రువీకరణ వంటి ముఖ్యమైన అంశాలపై ఏజెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వర్ బాలరాజు గౌడ్, విఠల్ నాయక్, బొంత సుధాకర్, గాడిపల్లి శ్రవణ్ కుమార్, బింగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# రాజీవ్ యువ వికాసంపై యువత ఆశలు.. నిరాశలేనా?

- దరఖాస్తు చేసి ఏడాది గడిచినా రుణాల ఊసే లేదు
- ప్రభుత్వం హామీలను అమలు చేయాలని నిరుద్యోగుల డిమాండ్

**తొలివెలుగు, చిన్నగూడూరు:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన "రాజీవ్ యువ వికాసం" పథకం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువత ఆశలు నెరవేరక నిరాశలో మునిగిపోయారు. స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తామంటూ ప్రభుత్వం రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు సబ్సిడీ రుణాలు అందిస్తామని ప్రకటించగా, వేలాది మంది యువకులు, మహిళలు ఆశతో దరఖాస్తులు సమర్పించారు. అయితే సంవత్సరం గడిచినా రుణాల పంపిణీపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో యువతలో ఆందోళన నెలకొంది. 2025 ఏప్రిల్‌లో ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించడంతో నిరుద్యోగులు కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు, రేషన్ కార్డులు తదితర పత్రాలను సేకరించేందుకు తహసీల్దార్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ రోజుల తరబడి తిరిగారు. పరిమిత గడువులోగా దరఖాస్తులు సమర్పించేందుకు మండుటెండల్లో క్యూలలో నిలబడి, రూ.500 నుంచి రూ.1,000 వరకు ఖర్చు చేసి పత్రాలను సిద్ధం చేశారు. దరఖాస్తులు స్వీకరించిన వెంటనే రుణాలు మంజూరవుతాయనే ఆశతో ఉన్న యువతకు ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందకపోవడంతో తీవ్ర నిరాశ నెలకొంది. స్వయం ఉపాధి ద్వారా జీవితంలో స్థిరపడాలన్న కలలు కరిగిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై బీఆర్ఎస్ నాయకుడు చెక్కల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు నోచుకోని హామీలతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులైన వారికి సబ్సిడీ రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



## వేడుకగా వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

- స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- రఘునాథపురంలో వైభవంగా పూజలు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం రఘునాథపురం గ్రామంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం జరిగిన వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. గర్భగుడిలో కొలువై ఉన్న వేంకటేశ్వర స్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. అనంతరం కల్యాణ మూర్తులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా, ఆలయ కమిటీ శాలువాతో సత్కరించింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, బొంత సుధాకర్, గాడిపల్లి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పశువైద్యాధికారులకు సత్కారం

- కోమటిరెడ్డి యువసేన రాష్ట్ర అధ్యక్షులు మెండు భాస్కర్ రెడ్డి



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల పశు వైద్యాధికారిగా సేవలందించి బదిలీపై వెళ్తున్న డాక్టర్ చంద్రారెడ్డి, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శివలను బుధవారం కోమటిరెడ్డి యువసేన రాష్ట్ర అధ్యక్షులు మెండు భాస్కర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి, చేనేత శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పశువుల సంరక్షణకు, రైతులకు డాక్టర్ చంద్రారెడ్డి అందించిన సేవలు అభినందనీయమన్నారు. నూతనంగా విధుల్లో చేరిన డాక్టర్ శివ సైతం అదే స్ఫూర్తితో రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య శాఖ అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన

- బూరుగుపల్లిలో ఘనంగా కార్యక్రమం



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలో బుధవారం మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సంపత్, ఉపసర్పంచ్ నాగవేణి, హౌసింగ్ వివేకానంద గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ఈ భవనం ఎంతో దోహదపడుతుందన్నారు. గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, సంఘబంధ అధ్యక్షురాలు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యం

- తప్పుల్లేని ఓటర్ల జాబితా కోసం ప్రజలు సహకరించాలి
- తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి.. అఖిలపక్ష సమావేశం నిర్వహణ

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను పారదర్శకంగా, తప్పుల్లేకుండా రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని చేపట్టిందని తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం జలాల్‌పురంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో అఖిలపక్ష కమిటీ నాయకులతో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి, మాస్టర్ ట్రైనర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 25 నుంచి నూతన ఓటర్ల నమోదు, ఓటరు వివరాల సవరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓలు) ప్రతి ఇంటికి మూడుసార్లు వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని, ప్రజలు అందుబాటులో ఉండి అవసరమైన సమాచారం, పత్రాలను అందజేసి సహకరించాలని కోరారు.

**ఓటర్ల సవరణ కాలపట్టిక:**



- జూన్ 25 - జూలై 24: బీఎల్‌ఓల ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ
- జూలై 31: ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ
- జూలై 31 - ఆగస్టు 30: అభ్యంతరాలు, క్లెయిముల స్వీకరణ
- జూలై 31 - సెప్టెంబర్ 30: అభ్యంతరాల పరిశీలన, ధ్రువీకరణ



- నవంబర్ 1: తుది ఓటర్ల జాబితా ప్రచురణ

ఓటర్ల జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావడంతో పాటు, తప్పులు లేకుండా జాబితాను సిద్ధం చేయడమే ఎన్నికల సంఘం లక్ష్యమని తహశీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేశ్వర్లు, మాస్టర్ ట్రైనర్లు కడారి నర్సిరెడ్డి, వియ్యాల బిక్షమయ్య, కోటయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలు శ్రామికవర్గానికి వ్యతిరేకం

- కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బీజేపీ పాలన: సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి
- రాజాపేటలో '12 ఏళ్ల బీజేపీ పాలన-ఒక పరిశీలన' సెమినార్

**తొలివెలుగు, రాజాపేట:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు సంపద సృష్టించే శ్రామిక వర్గానికి వ్యతిరేకంగా, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి విమర్శించారు. బుధవారం రాజాపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో '12 ఏళ్ల బీజేపీ పాలన - ఒక పరిశీలన' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి బూరుగు స్వప్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. కార్మికులకు రక్షణగా ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం వల్ల శ్రామికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్మిక హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం, వాటిని బలహీనపరిచే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. అలాగే అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికే ప్రీ-ప్రైమరీ పాఠశాలల పేరుతో కొత్త విధానాలను తీసుకొస్తున్నారని విమర్శించారు. ఐసీడీఎస్, ఉపాధి హామీ వంటి పేదల సంక్షేమ పథకాలకు కేంద్ర బడ్జెట్‌లో నిధులను తగ్గించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. దేశ ఆర్థిక పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, 2014లో డాలర్ విలువ రూ.60గా ఉండగా ప్రస్తుతం అది రూ.95కు చేరడం ఆర్థిక వ్యవస్థ క్షీణతకు అద్దం పడుతోందన్నారు. అనంతరం అంగన్‌వాడీ ఉద్యోగులు రాజాపేటలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాగ్యలక్ష్మి, పద్మ, శోభారాణి, మాధవి, వసంత, భారతి, రజిత తదితరులు పాల్గొన్నారు.



# వ్యసనాలకు దూరంగా ఉండి.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- మాదకద్రవ్యాలతో జీవితాలు బుగ్గిపాలు
- బొందుగుల ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు
- విద్యార్థుల భారీ ర్యాలీ.. అవగాహన కల్పించిన ఏఎస్ఐ ప్రకాష్



**తొలివెలుగు, రాజాపేట:** నేటి యువత, విద్యార్థి లోకం మాదకద్రవ్యాల వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాజాపేట పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఎస్ఐ) ప్రకాష్ పిలుపునిచ్చారు. బుధవారం రాజాపేట మండలం బొందుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 'మాదకద్రవ్యాల నిర్మూలన-దుష్పరిణామాలు' అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిల్లా ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావే శానికి ఏఎస్ఐ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్షణికానందం కోసం అలవాటు చేసుకునే డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్న విద్యార్థుల జీవితాలు నడిరోడ్డున పడి బుగ్గిపాలవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణించడమే కాకుండా, పచ్చని కుటుంబాల్లో తీవ్ర విషాదం నిండుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. సదస్సు అనంతరం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని, 'మాదకద్రవ్యాలను అంతం చేద్దాం-నవసమాజాన్ని నిర్మిద్దాం', 'మత్తు వద్దు-చదువే ముద్దు' అంటూ విద్యార్థులు చేసిన నినాదాలు గ్రామ వీధుల్లో మారుమోగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.




# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం కావాలి

- మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరూ భాగస్వాములు కావాలి: చౌటుప్పల్ సీఐ మన్మధ కుమార్
- అంగన్‌వాడీలకు అవగాహన సదస్సు.. మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ, ముగ్గుల పోటీలు



**తొలివెలుగు, చౌటుప్పల్:** మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చౌటుప్పల్ సీఐ జి. మన్మధ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తుల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబాలు ఆర్థిక, సామాజిక సంక్షోభంలోకి నెట్టబడతాయని అన్నారు. డ్రగ్స్ వ్యసనం కారణంగా అనేక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయిలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు, యువతలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా డ్రగ్స్ విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సీఐ మన్మధ కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, కౌన్సిలర్లు ఎండి హన్ను, పాక చిరంజీవి, పట్టణ నాయకులు చింతల సాయిలు, ఎస్ఐ కనకటి యాదగిరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి

- అనుమతులు లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి
- అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం
- ఎంఈఓ పనితీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రైవేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడీని వెంటనే అరికట్టాలని, అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని పీబీ గార్డెన్‌లో ఈ అంశంపై ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్, పల్లె మధు, దిండు భాస్కర్ మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం-2009ను ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు తుంగలో తొక్కుతూ విద్యను వ్యాపారంగా మార్చాయని విమర్శించారు. అడ్మిషన్, ట్యూషన్, రవాణా, పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించాల్సిన 25 శాతం ఉచిత సీట్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే అక్రమాలకు అండగా నిలుస్తున్న విద్యాశాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఎంఈఓ పనితీరుపై సమగ్ర విచారణ జరిపి సస్పెండ్ చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే తల్లిదండ్రులను సమీకరించి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కట్టెల లింగస్వామి, బండిగారి శ్రీధర్, ఒంటెద్దు లింగస్వామి, ఖయ్యూం, రాఘవ, ఇర్ఫాన్, పందుల శరత్, గంగాదేవి శివ తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ చంద్రారెడ్డికి ఆత్మీయ వీడ్కోలు





- రైతులకు అందించిన సేవలు అభినందనీయమన్న జిల్లా అధికారి జానయ్య
- ఘనంగా సత్కరించిన ప్రజాప్రతినిధులు, పశువైద్య బృందం

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల పశు వైద్యాధికారిగా సేవలందించి, బదిలీపై వెళ్తున్న డాక్టర్ ఎం. చంద్రారెడ్డికి బుధవారం మండల కేంద్రంలోని చల్మడ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ వీడ్కోలు సన్మాన సమావేశం నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన హైదరాబాద్‌లోని శాంతినగర్ ప్రాథమిక పశువైద్యశాలకు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జానయ్య మాట్లాడుతూ.. డాక్టర్ చంద్రారెడ్డి గత ఎనిమిదేళ్లుగా రాజాపేట మండలంలో పశువైద్య సేవలను బలోపేతం చేశారన్నారు. అనేక పశువైద్య శిబిరాలు, రైతు అవగాహన సదస్సులు నిర్వహించి పాడి రైతులకు అండగా నిలిచారని కొనియాడారు. అనంతరం ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, సహచర వైద్యులు డాక్టర్ చంద్రారెడ్డిని చేనేత శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదర్ డెయిరీ డైరెక్టర్లు గొల్లపల్లి రామిరెడ్డి, సంధిల భాస్కర్, మాజీ డైరెక్టర్ చింతలపూడి వెంకటరామిరెడ్డి, జన్నపల్లి బాలరాజు రెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వరు బాలరాజు గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ గౌడ్, పశువైద్యాధికారులు డాక్టర్ రమేష్, డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ కె. శివరామకృష్ణ, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సునీత, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

# ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలి





- గెలిచినా, ఓడినా ప్రజల మధ్యనే ఉండాలి
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- చౌటుప్పల్ మండల, పట్టణ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

**తొలివెలుగు, చౌటుప్పల్:** నాయకుడనే వాడు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి బాధలను వింటూ, గౌరవించినప్పుడే ప్రజా హృదయాల్లో మనగలుగుతాడని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని ఆయన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎంపికైన చౌటుప్పల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, పట్టణ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డిల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఇరువురినీ అభినందించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో ఓపిక, పట్టుదల చాలా ముఖ్యమన్నారు. గెలిచిన తర్వాత ప్రవర్తనలో మార్పు వస్తే.. తదుపరి ఎన్నికల్లో ప్రజలు వ్యతిరేక తీర్పు ఇస్తారని గుర్తుచేశారు. 2018లో రాష్ట్రమంతా ఒకలా ఉంటే మునుగోడులో కాంగ్రెస్‌ను గెలిపించారని, ఇదంతా కలిసికట్టుగా పనిచేయడం వల్లే సాధ్యమైందన్నారు. నూతన అధ్యక్షులు అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేయాలన్నారు. తాను అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అనంతరం నూతన అధ్యక్షులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మొగదాల పావని రమేష్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్ ఛార్జ్ పబ్బు రాజుగౌడ్, కౌన్సిలర్ కాసర్ల మంజుల, మాజీ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్, మాజీ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నర్సింహ గౌడ్, నాయకులు బాలుమహేంద్ర, వెల్గ రాజశేఖర్ రెడ్డి, మండల ముఖ్య నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.





# ప్రీ-స్కూల్స్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

- అంబేద్కర్ విగ్రహానికి అంగన్‌వాడీల వినతి
- రాజాపేటలో నిరసన ప్రదర్శన

**తొలివెలుగు, రాజాపేట:** అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉన్న ప్రీ-స్కూల్స్ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాజాపేట మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు నిరసన తెలిపారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు బూరుగు స్వప్న మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోకాలంగా పేద పిల్లలకు, గర్భిణులకు సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను కొత్త విధానాల పేరుతో నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల అంగన్‌వాడీ వ్యవస్థ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతకుముందు మండల కేంద్రంలో అంగన్‌వాడీలు ప్రదర్శన నిర్వహించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భాగ్యలక్ష్మి, పద్మ, శోభారాణి, మాధవి, వసంత, భారతి, రజిత, చంద్రకళ, విజయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి ప్రతిభావంతులకు నగదు బహుమతులు

- తంగడపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో ఘనంగా పురస్కారాల ప్రదానం
- ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య

**తొలివెలుగు, చౌటుప్పల్:** తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులకు నగదు బహుమతులు అందజేశారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భార్గవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యలు ముఖ్య అతిథిలుగా హాజరై విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు మోట సత్తయ్య సౌజన్యంతో ఈ నగదు బహుమతులను ఏర్పాటు చేశారు. పదో తరగతిలో 562 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన మద్దుగాని మాస్వినికి రూ.3,116, ద్వితీయ స్థానంలో నిలిచిన నూతలపాటి మాధురికి రూ.1,116 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య , కౌన్సిలర్లు ఆలే చిరంజీవి, రాజారత్నం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఓదరి పద్మ, శ్రీకాంత్, స్వామి, అచ్చయ్య, మోహన్ రెడ్డి, వెంకటయ్య, కిషోర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

